ప్రతిభావంతులకు ప్రభుత్వ ఆసరా

ప్రతిభావంతులైన ఎందరో విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక పరిస్థితులు అవరోధమవుతున్నాయి. ఇలాంటి వారు ఎలాంటి ఆటంకం లేకుండా చదువులు కొనసాగించడానికి కేంద్రం ప్రోత్సాహం అందిస్తోంది. ఇంటర్మీడియట్ తర్వాత ఏదైనా యూజీలో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ (పీఎం-యూఎస్‌పీ) సెంట్రల్ సెక్టార్ స్కీమ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ పేరుతో వీటిని అందిస్తున్నారు. సీనియర్ సెకెండరీ/ఇంటర్మీడియట్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహం అందుతుంది!

ఈ ఉపకార వేతనాలకు ప్రస్తుతం ఏదైనా యూజీ లేదా ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో చేరినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతిభావంతులకు రోజువారీ అవసరాలను తీర్చడానికి వీటిని ఏర్పాటుచేశారు. యూజీ నుంచి పీజీ వరకు ఐదేళ్లపాటు ఈ ఉపకార వేతనాలు అందుతాయి. బీటెక్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్నవారికి నాలుగేళ్ల వరకు చెల్లిస్తారు. సాధారణ డిగ్రీలు, ఇంటిగ్రేటెడ్ పీజీలు చదువుతున్నవారికి ఏడాదికి రూ.12,000 చొప్పున మొదటి మూడేళ్లు వారి బ్యాంకు ఖాతాలో వేస్తారు. పీజీలో చేరినప్పుడు ఏడాదికి రూ.20,000 చొప్పున రెండేళ్లు అందిస్తారు. బీటెక్ విద్యార్థులైతే నాలుగో ఏడాది రూ.20,000 ఇస్తారు.

ఎవరు అర్హులు?

- 2022-2023 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ /+2 కోర్సులు పూర్తిచేసుకున్నవారే అర్హులు.
- ఇంటర్ లేదా ప్లస్2లో 80 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. అంటే ఆ బోర్డు పరిధిలో టాప్ 20 పర్సంటైల్‌లో ఉండాలి.
- రెగ్యులర్ విధానంలో చదివినవాళ్లే అర్హులు. డిప్లొమా విద్యార్థులకు అవకాశం లేదు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.4.5 లక్షల లోపు ఉండాలి.
- ఇతర ఏ స్కాలర్‌షిప్పులనూ పొందనివారే దీనికి అర్హులు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించినవాళ్లు అనర్హులు.
- స్కాలర్‌షిప్పులకు ఎంపికైనవాళ్లు తర్వాత ఏడాదిల్లోనూ వీటిని పొందడానికి అంతకుముందు విద్యా సంవత్సరంలో కనీస హాజరు ఉండాలి. నిర్దేశిత మార్కుల శాతం తప్పనిసరి.

కేటాయింపు ఇలా...

దేశవ్యాప్తంగా మొత్తం 82,000 స్కాలర్‌షిప్పులు ఉన్నాయి. వీటిని రాష్ట్రాలవారీ విభజించారు. ఇందుకు రాష్ట్రాలవారీ 18-25 ఏళ్ల వయసు జనాభాను ప్రాతిపదికగా తీసుకున్నారు. రాష్ట్రాల వారీ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డుల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతంతోనూ మదింపు చేస్తారు. రాష్ట్రాలవారీ కేటాయించిన స్కాలర్‌షిప్పుల్లో సైన్స్, కామర్స్, హ్యూమానిటీస్ విద్యార్థులను 3:2:1 విధానంలో ఎంపికచేస్తారు. అలాగే మొత్తం స్కాలర్‌షిప్పుల్లో 50 శాతం అమ్మాయిలకు దక్కుతాయి.

రిజర్వేషన్: ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు 5 శాతం స్కాలర్‌షిప్పులు కేటాయించారు.

దరఖాస్తులు: విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం సంబంధిత స్కాలర్‌షిప్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పూరించాలి. అవసరమైన పత్రాలను జత చేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: డిసెంబరు 31

వెబ్‌సైట్: https://scholarships.gov.in/

రెండు మూడు బస్సులు మారో.. రైల్లో ప్రయాణించో చాలామంది కార్యాలయాలకు వెళ్తుంటారు. అనుకోని పరిస్థితుల్లో ఒక్కోసారి కాస్త ఆలస్యమైనా.. సమస్యే. రాస్తారోకోలూ, ట్రాఫిక్ జామ్‌లూ లాంటి చిక్కులు అదనం. ఇలా ఇంటి నుంచి ఎంతో దూరంగా ఉండే ఆఫీసుకు ప్రయాణించడానికి ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఆధునిక సాంకేతికత మూలంగా ఆవిర్భవించి ప్రాచుర్యం పొందిన 'రిమోట్ వర్క్' విధానం ఈ సమస్యల నుంచి తప్పిస్తుంది. అయితే విశ్వసనీయమైన రిమోట్ ఉద్యోగాలను అన్వేషించటం తప్పనిసరి.

రిమోట్ కొలువుకు ఆన్‌లైన్ వేదికలు!

లాక్‌డౌన్ సమయంలోనే కాకుండా ఆ తర్వాత కూడా చాలా కంపెనీలు రిమోట్ వర్క్‌కే ప్రాధాన్యమిస్తున్నాయి. కొన్ని సంస్థలైతే తమ ఉద్యోగులకు ఇంటి నుంచే పనిచేసే అవకాశాన్నీ ఇస్తున్నాయి. దీంట్లో భాగంగా.. ఇంటి నుంచి పనిచేయొచ్చు లేదా ప్రయాణాలు చేస్తూనో, పార్కులో కూర్చునో లేదా ఇద్దరు ముగ్గురు కలిసి ఒకచోట కూర్చునో హాయిగా పనిచేసుకోవచ్చు.

రిమోట్ వర్క్‌తో సమయం, ప్రయాణ ఛార్జీల ఆదాతోపాటు మరెన్నో ప్రయోజనాలున్నాయి.

- నిర్దిష్ట సమయంలో పనులు పూర్తిచేసి మిగిలిన సమయాన్ని విద్యార్థతలు పెంచుకోవడానికి వినియోగించొచ్చు. ఆసక్తులను అనుసరించి ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఏదైనా కోర్సులో చేరొచ్చు.
- ప్రయాణంలో వృథా అయ్యే సమయాన్ని సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడానికి వినియోగించుకోవచ్చు.
- ఆసక్తి ఉంటే ఆన్‌లైన్ క్లాసుల్లో చేరొచ్చు. నైపుణ్యాల శిక్షణా తీసుకోవచ్చు.
- అభిరుచులకు అనుగుణంగా ఏవైనా క్రీడలను సాధన చేయొచ్చు. సంగీతం, చిత్రలేఖనం, యోగా, ధ్యానం నేర్చుకోవచ్చు.
- రిమోట్ వర్కింగ్ పద్ధతిలో పనిచేయడం మహిళలకు ఎక్కువ సౌలభ్యం. ఒకపక్క పెద్దవాళ్లు లేదా చిన్నారుల సంరక్షణ బాధ్యతలను చూసుకుంటూనే పనిచేసుకునే అవకాశం ఉంటుంది.
- ఒక్కోసారి సమావేశాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. వర్చువల్ సమావేశాల వల్ల దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరమూ ఉండదు.
- నగరంలోనో, పట్టణంలోనో ఉండి పనిచేయాల్సిన అవసరమూ ఉండదు. ఇంటర్నెట్ సదుపాయం ఉంటే చాలు.. ఎక్కడి నుంచైనా పనిచేసుకోవచ్చు.
- కుటుంబంతో కలిసి సొంతూరులోనే ఉంటూ పనిచేసుకోవచ్చు.
- ఇష్టమైతే సముద్ర తీరంలోనో., తోటలోనో కూర్చుని కూడా విధులు నిర్వర్తించవచ్చు.
- ఉద్యోగ, వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం సాధించడానికి అవకాశం ఉంటుంది.
- కొన్ని కార్యాలయాల్లో అనవసర రాజకీయాలు చోటుచేసుకుంటాయి. ఎంత జాగ్రత్తగా ఉన్నా... కొన్ని అనవసర విషయాల్లోకి లాగే ప్రయత్నాలు జరుగుతుంటాయి. రిమోట్ వర్కింగ్‌లో ఇలాంటివాటికి దూరంగా ప్రశాంతంగా ఎవరి పని వారు చేసుకుపోవచ్చు.

ఇన్ని ప్రయోజనాలను అందించే రిమోట్ వర్కింగ్ సదుపాయాన్ని అందించే కొలువులను ప్రముఖ ఆన్‌లైన్ వేదికల ద్వారా అందిపుచ్చుకోవచ్చు.

https://www.flexjobs.com/: సుమారు యాభై రంగాలకు చెందిన ఉద్యోగ వివరాలు దీంట్లో ఉంటాయి. ఫైనాన్స్, ఈవెంట్ ప్లానింగ్, హ్యూమన్ సర్వీసెస్, ఇన్సూరెన్స్... మొదలైన రంగాలకు చెందిన పార్ట్ టైమ్, ఫుల్‌టైమ్ కొలువులూ ఉంటాయి. తక్కువ, ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు ఇద్దరూ ప్రయోజనం పొందే విధంగా ప్రవేశ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ హోదా వరకూ ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి.

https://remote.co/: బుక్ కీపింగ్, ట్రాన్స్‌లేషన్, డేటా ఎంట్రీ, హెల్త్‌కేర్, అడ్మినిస్ట్రేషన్ రంగాలకు చెందిన ఉద్యోగాలను అందిస్తుంది. అదనంగా బ్లాగ్‌ను కూడా నిర్వహిస్తుంది. దీంట్లో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న అంశాల మీద చర్చలు కూడా జరుగుతాయి. వివిధ రంగాల వ్యక్తులు అడిగే సందేహాలకు సమాధానాలనూ అందిస్తుంది. దీంట్లోని రిమోట్ వర్క్ స్టాటిస్టిక్స్ ట్యాబ్‌ను ఉపయోగించి.. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతోన్న రంగాల సమాచారాన్నీ తెలుసుకోవచ్చు.

https://remoteok.com/: సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, కస్టమర్ సపోర్ట్, మార్కెటింగ్, డిజైన్.. ఇతర రంగాలకు చెందిన ఉద్యోగాలు ఉంటాయి. ఎక్కువ నుంచి తక్కువ వేతనాలు అందించే ఉద్యోగాలు, కంపెనీల వివరాలు దీంట్లో ఉంటాయి.

https://www.upwork.com/: డెవలప్‌మెంట్, ఐటీ, ఏఐ సర్వీసెస్, ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, రైటింగ్, ట్రాన్స్‌లేషన్, డిజైన్, క్రియేటివ్, సేల్స్, మార్కెటింగ్, అడ్మిన్, కస్టమర్ సపోర్ట్, ఫైనాన్స్, అకౌంటింగ్, లీగల్, హెచ్ అండ్ ట్రెయినింగ్ మొదలైన రంగాలకు చెందిన ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. వ్యక్తిగత నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఫ్రీలాన్సర్, షార్ట్‌టర్మ్ ఉద్యోగాలూ ఉంటాయి.

https://weworkremotely.com/: ప్రతినెలా సుమారు నలభైఅయిదు లక్షలమంది దీన్ని సందర్శిస్తారు. ప్రోగ్రామింగ్, డిజైన్, కాపీరైటింగ్, సేల్స్, మార్కెటింగ్ రంగాల్లో ఫుల్‌టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉంటాయి. దీంట్లో రిమోట్ వర్కింగ్ ఉద్యోగావకాశాలు, పంద సంస్థల వివరాలూ అందుబాటులో ఉన్నాయి.

https://in.indeed.com/: ఇది నౌకరి.కామ్ లాంటిదే అయినప్పటికీ వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్‌లకు ప్రత్యేక సెక్షన్‌ను నిర్వహిస్తుంది. ఉద్యోగ అన్వేషణలో ఉన్నవాళ్లు.. ఏ ఉద్యోగం కావాలి?, ఎంత వేతనం ఆశిస్తున్నారు, అనుభవం.. మొదలైన వివరాలను ఇక్కడ తెలియజేయాలి. వారి విద్యార్హతలు, తెలిపిన వివరాలకు అనుగుణంగా ఉద్యోగాన్ని అందిస్తారు.

https://jobspresso.co/: టెక్నాలజీ, మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్, డిజైన్, యూఎక్స్, డెవోప్స్, రైటింగ్, ఎడిటింగ్ అండ్ డెవలప్‌మెంట్ రోల్స్ . మొదలైన రంగాల్లో ఉద్యోగాలను అందిస్తుంది. ఈ వేదిక ద్వారా ఇంగ్లిష్ ట్యూటర్‌గానూ అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. విద్యార్హతల సర్టిఫికెట్లు, అనుభవంలేకపోయినా నైపుణ్యాల ఆధారంగానూ అవకాశాలు కల్పిస్తారు.

https://powertofly.com/: ఈ వేదిక ద్వారా మహిళా ఉద్యోగితకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కెరియర్ ఎంపికలో మహిళలకు సలహాలూ, సూచనలు అందిస్తారు. వివిధ అంశాలపైన ఏడాది పొడవునా సమావేశాలను నిర్వహిస్తారు.

https://www.virtualvocations.com/: వివిధ రంగాల్లో టెలికమ్యూటింగ్ కొలువులకు ప్రత్యేకించింది. మార్కెటింగ్, అకౌంటింగ్ రంగాలకు చెందిన ఉద్యోగాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఫ్రీలాన్సింగ్ ఉద్యోగాలనూ అందిస్తుంది.

https://remotive.com/: ఉద్యోగాన్వేషకులకు అవసరమైన వెబినార్లు, తాజా సమాచారాన్ని అందిస్తుంది. నైపుణ్యాలు, ప్రదేశం, సంస్థ ఆధారంగా ఉద్యోగాల అన్వేషణకు తోడ్పడుతుంది.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

గుంటూరు, విజయవాడలలో

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: వ్యాహృతి ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, యాభ నైపుణ్యాలు
☛ internshala.com/i/beff2d

విజయవాడలో

చార్టర్డ్ అకౌంటెన్సీ

సంస్థ: అరిహంత్ ఎంటర్‌ప్రైజెస్
స్టైపెండ్: నెలకు రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19
అర్హతలు: అకౌంటింగ్, ట్యాలీ నైపుణ్యాలు
☛ internshala.com/i/68de3e

వైజాగ్, హైదరాబాద్, విజయవాడల్లో..

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: మార్క్‌అప్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
అర్హతలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కేన్వా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/847de8

అలసట పెరిగి.. ఉత్సాహం తగ్గుతోందా?

కొంతమంది విద్యార్థులు గంటలకొద్దీ సమయాన్ని చదువుతూనే గడుపుతుంటారు. పరీక్షల ముందు విపరీతమైన ఒత్తిడినీ ఎదుర్కొంటుంటారు. ఇవన్నీ కూడా భావోద్వేగాలు, శారీరక, మానసిక ఆరోగ్యాల మీద ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ పరిస్థితినే 'ఎకడమిక్ బర్న్ అవుట్'గా చెబుతారు నిపుణులు.

కొన్ని వారాలు లేదా నెలలపాటు ఒకే సిలబస్ చదవడం.. కొన్ని ప్రాజెక్టుల మీద నెలల తరబడి పనిచేయడం.. వీటన్నిటి కారణంగా కూడా బాగా అలసిపోవడం, నిరుత్సాహం ఆవహించడం లాంటివి జరుగుతుంటాయి. ఇవన్నీ కూడా ఎకడమిక్ బర్న్ అవుట్‌కు కారణం అవుతుంటాయి. ఫలితంగా తలనొప్పి, నిద్రలేమి, కుంగుబాటు.. లాంటి అనేక అనారోగ్య సమస్యలకూ గురయ్యే అవకాశం ఉంటుంది. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా దీన్నుంచి బైటపడటానికి ప్రయత్నించవచ్చు. అవేమిటో చూద్దామా...

- ఒక్కోసారి బాగా అలసిపోయినప్పుడు ముఖ్యమైన కొన్ని అసైన్‌మెంట్లు, ప్రాజెక్టు పనులను వాయిదా వేస్తుంటారు. అలా కాలయాపన చేయడం వల్ల నిర్దిష్ట గడువులోగా ఏ పని పూర్తికాదు. దాంతో ఒత్తిడికి గురై.. నిద్ర పట్టకపోవడం, నిరాశాలాంటి సమస్యలు చుట్టుముడతాయి.
- నిర్దిష్ట గడువులోగా ఏ పని పూర్తిచేయాలన్నా.. ముందుగా కావల్సింది సమయపాలన. విద్యా సంవత్సరం మొదట్లో సమయాన్ని ఎక్కువగా వృథా చేస్తుంటారు కొందరు. దీంతో సంవత్సరాంతంలో ఇబ్బంది పడుతుంటారు. మొదటినుంచీ సమయపాలనను కచ్చితంగా పాటిస్తే ఇలాంటి ఇబ్బందేమీ ఉండదు.
- ఎడతెగని ఆన్‌లైన్ విద్యాభ్యాసం, భావాలు పంచుకునే స్నేహితులు దగ్గర్లో లేకపోవడం లాంటి కారణాల వల్ల ఒంటరిగా ఉన్నామనే భావన పెరిగి, వ్యాకులతకు గురవ్వవచ్చు. ఆత్మీయ మిత్రులను కలవటం, ఫోన్‌లోనైనా సంభాషించడం వల్ల ఇలాంటి సమస్యను అధిగమించవచ్చు.
- క్లాస్‌మేట్లతో మార్కుల పరంగా, ఇతరత్రా పోల్చుకునే ధోరణి విద్యార్థుల్లో ఉంటుంది. ఇది ఒత్తిడికి కారణమయ్యే ప్రమాదం ఉంది. ఇలా పోల్చుకోవడం ఆపెయ్యాలి.
- చాలామంది విద్యార్థులు కోర్సు పరంగా తాము గురయ్యే ఒత్తిడికి అధ్యాపకులను నిందిస్తుంటారు. ఇది సరికాదు. నిజానికి తాము ఒత్తిడి నుంచి బయటపడటానికి అధ్యాపకులే తమకు సహాయపడతారని గ్రహించాలి. చొరవగా తమ సమస్యను చెప్పి వారి సలహా పొందటం సముచితం.
- ఒకేసారి పెద్ద లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించలేకపోయినా నిరాశ ఆవరిస్తుంది. ముందుగా స్వల్పకాలిక లక్ష్యాలను పెట్టుకుని వాటిని నిర్దిష్ట సమయంలోగా సాధించడానికి ప్రయత్నించాలి. ఆ తర్వాత దీర్ఘకాలిక లక్ష్యాల వైపు దృష్టిని సారించాలి.
- **చదువు ధ్యాసలో పడి అభిరుచులను పక్కన పెట్టేస్తుంటారు చాలామంది విద్యార్థులు. ఇది ఎంతమాత్రం సరికాదు. కొత్త భాష, సంగీతం నేర్చుకోవడం లేదా నచ్చిన ఆటలు ఆడటం.. ఇలా వేటినైనా ఎంచుకోవచ్చు. వాటికి కొంత సమయాన్ని కేటాయించడం వల్ల మూసధోరణికి భిన్నంగా సమయాన్ని గడపగలుగుతారు.**
- ఎన్ని పనులున్నా.. వ్యాయామానికి సమయాన్ని కేటాయించాలి. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా పనిచేయడానికి వ్యాయామం ఎంతో తోడ్పడుతుంది. ఇది విసుగ్గా అనిపిస్తే నచ్చిన క్రీడను ఎంచుకోవచ్చు. అలాగే పోషకాహారం తీసుకుంటూ తగినన్ని మంచినీళ్లూ తాగాలి. దీంతో శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

- నిశ్శబ్దంగా ఎలాంటి అవరోధాలూ లేకుండా ఉంటాయని.. నాలుగ్గోడల మధ్య చదవడానికే ఇష్టపడతారు ఎక్కువమంది. అయితే అప్పుడప్పుడూ ఆరుబయట ఉండే పచ్చని చెట్ల మధ్య చదవడానికీ ప్రాధాన్యమివ్వాలి. ఇలా ప్రకృతి ఒడిలో చదవడం వల్ల ఒత్తిడి తగ్గి.. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో మరింత ఉత్సాహంగా చదవగలుగుతారు.

నోటిఫికేషన్స్
ప్రభుత్వ ఉద్యోగాలు

ఐఐటీ దిల్లీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దిల్లీ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద 25 అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్-1/2) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ పీడబ్ల్యూబీడీ/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
విభాగాలు: అప్లైడ్ మెకానిక్స్, ఫిజిక్స్, బయోమెడికల్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.
అర్హత: సంబంధిత విభాగంలో మొదటి శ్రేణిలో పీహెచ్‌డీతో పాటు అనుభవం.
ఎంపిక: విద్యార్హత, అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-12-2023.
వెబ్‌సైట్: https://home.iitd.ac.in/jobs-iitd/index.php

షార్, శ్రీహరికోటలో సైంటిస్ట్/ ఇంజినీర్‌లు

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, (ఎస్‌డీఎస్‌సీ షార్) 10 సైంటిస్ట్/ ఇంజినీర్ 'ఎస్‌సీ' పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: పాలిమర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ రబ్బర్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ (హార్టికల్చర్/ ఫారెస్ట్రీ).
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ.
దరఖాస్తు రుసుము: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు, మాజీ సైనికులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 03.11.2023.
ఫీజు చెల్లింపు చివరి తేదీ: 04.11.2023.
వెబ్‌సైట్: https://apps.shar.gov.in/sdscshar/result1.jsp

ఐఐటీ పాలక్కడ్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

కేరళ రాష్ట్రంలోని ఐఐటీ పాలక్కడ్ కింది 22 నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 09
- జూనియర్ సూపరింటెండెంట్: 06
- హార్టికల్చర్ అసిస్టెంట్: 01
- అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్: 01
- మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 05

అర్హత: పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: పరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03-11-2023.
వెబ్‌సైట్: https://joinus.iitpkd.ac.in/

శాంతినికేతన్‌లో చేరే మార్గం?

ఇంటర్మీడియట్ చదువుతున్నాను. శాంతినికేతన్‌లో ఫైనార్ట్స్ డిగ్రీ చదవాలనుంది. దీనికోసం ప్రవేశ పరీక్ష ఏమైనా రాయాలా? – అపర్ణ

■ విశ్వభారతి యూనివర్సిటీ, శాంతినికేతన్‌లో ఫైన్ ఆర్ట్స్ డిగ్రీలో డిజైన్-సిరామిక్స్ అండ్ గ్లాస్, డిజైన్-టెక్స్‌టైల్, గ్రాఫిక్ ఆర్ట్ (ప్రింట్ మేకింగ్), హిస్టరీ ఆఫ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్ స్పెషలైజేషన్లు ఉంటాయి. అక్కడ చదవాలంటే ముందుగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే దేశవ్యాప్త ప్రవేశపరీక్ష రాయాలి. దానిలో మెరుగైన ర్యాంకు సాధించి, విశ్వభారతి యూనివర్సిటీకి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించే ప్రాక్టికల్/ రిటెన్ టెస్ట్, వైవా వోస్ పరీక్షకు హాజరు అవ్వాలి.

ప్రాక్టికల్/రిటెన్ టెస్ట్ రెండు గంటల వ్యవధిలో ఉంటుంది. వైవా వోస్ పరీక్షకు వెళ్ళేప్పుడు విద్యార్థులు గతంలో వేసిన చిత్రాలు/ పెయింటింగ్‌లు/ చెక్కిన శిల్పాలు/ తీసిన డాక్యుమెంటరీలు తీసుకొని వెళ్ళాలి. ఎన్‌టీఏ పరీక్షలో వచ్చిన మార్కులకు ప్రాక్టికల్/రిటెన్ టెస్ట్, వైవా వోస్‌ల్లో వచ్చిన మార్కులను కలిపి మెరిట్ లిస్ట్ తయారుచేసి ప్రవేశాలు చేపడతారు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్